డీసీసీ అధ్యక్ష పదవికి కోట నీలిమ నామినేషన్

సనత్‌నగర్: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు సీపీ జోషికి నీలిమ తన నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నానని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారా ఎంపిక చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని పత్రికా ప్రకటనలో తెలిపారు.

త్రోబాల్ విజేత అలేఖ్య టీమ్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో 2కె21 బ్యాచ్ ఆధ్వర్యంలో సైనెక్సెస్ పేరిట నిర్వహిస్తున్న కాలేజీ ఫెస్ట్‌లో భాగంగా గురువారం నిర్వహించిన మహిళల త్రోబాల్ పోటీల్లో అలేఖ్య జట్టు విజేతగా నిలిచింది. దివ్య జట్టుపై 15–8, 16–14 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించింది. శ్రేయ, అశ్వినీ, అలేఖ్య, ప్రతిభ, దివ్యలు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు. గాంధీ వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, స్పోర్ట్స్ సెక్రటరీ కిరణ్‌మాదల, ఫిజికల్ డైరెక్టర్ వేణు, డాక్టర్ లెనిన్, అపూర్వరెడ్డిలు పాల్గొన్నారు. విజేతలకు గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణిలు అభినందించారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

సికింద్రాబాద్: విద్యార్థులు చిన్నతనంలో దురలవాట్లకు దూరంగా ఉండి, ఉన్నత విద్యలు చదవడం ద్వారా భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లోని అమన్ వేదిక ఆధ్వర్యంలోని రెయిన్‌బో బాలికల ఆశ్రమంలో పోలీసులు, బీజేపీ నాయకులు, రెయిన్‌బో ప్రతినిధులు సదస్సు నిర్వహించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలో 50 మంది బాలికలు ఆశ్రయం పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. సదస్సు సందర్భంగా ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు రాబట్టే అవకాశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ఆత్మరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులకు ఫిర్యాదు చేసే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో చిలకలగూడ ఎస్‌ఐ చంద్రయ్య, బీజేపీ నాయకులు రవిప్రసాద్‌గౌడ్, అజయ్‌నాయుడు, పద్మారావు, రాజు, రవి, రెయిన్‌బో సంస్థ ప్రతినిధులు రూనీ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట సీజీహెచ్‌లో సీపీఆర్‌పై శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం బేగంపేటలోని సీజీహెచ్‌ఎస్‌లో సీపీఆర్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సెయింట్ జాన్ అంబులెన్స్ డైరెక్టర్ వీవీవీఎస్ మూర్తి, సెక్రటరీ డాక్టర్ ఎం.మహేంద్ర కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గుండె సంబంధిత అత్యవసర సమయంలో ఎలా వ్యవహరించాలో అక్కడి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. సెయింట్ జాన్ అంబులెన్స్ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యురాలు డాక్టర్ సవిత ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఆకస్మిక గుండెపోటు సంకేతాలను ఎలా గుర్తించాలో కూడా వివరించినట్టు తెలిపారు.

ఐఐసీటీలో ఇన్నోవేషన్ ఇన్ హెల్త్ కేర్ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్

లాలాపేట: సావిస్కార్, ఐఐసీటీ, సీసీఎంబీ, అటల్ ఇంక్యుబేషన్ ఆధ్వర్యంలో గురువారం ఐఐసీటీలో ఇన్నోవేషన్ ఇన్ హెల్త్ కేర్, ఫార్మా టెక్నాలజీ భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశ ఫార్మా రంగ విశిష్టత, ఫార్మారంగం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లపై విద్యార్థులకు, ఇండస్ట్రీకు మధ్య వారధిగా సావిస్కార్ పనిచేయాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రాన్యూలెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిగురుపాటి ఉమాదేవి, ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎంబి డైరెక్టర్ డా. వినయ్ నందికూరి, సఫలా ఆర్గానిక్ సీఈఓ పైడి ఎల్లారెడ్డి, ఏబీవీపీ క్షేత్రీయ సంఘటన మంత్రి శివకుమార్, సావిస్కార్ స్టేట్ కన్వీనర్ సిద్ధికా, ధృహన్ చెలిమెలా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ చెఫ్ వేడుకలు

సనత్‌నగర్: ది చెఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని ఆగ్రోమెక్‌లో గురువారం అంతర్జాతీయ చెఫ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వంటల నిపుణులు విభిన్న రకాల ఆహార పదార్థాలను, పిండి వంటలను ప్రదర్శించారు. ది చెఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు రాజుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు ప్రముఖ చెఫ్‌లు కాశీ విశ్వనాధన్, శేఖర్, సంజయ్ తుమ్మ, సుధాకర్, ఫల్గుణి నాయుడు, సుధాకుమార్, అన్మోల్ ప్రభు, కళ్యాణ్ చక్రవర్తి, రవీంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు. రుచిగా, శుచిగా, వినూత్నంగా ఆహార పదార్థాలను తయారు చేసిన వారికి బహుమతులను అందజేశారు.

ప్రజాప్రతినిధులు × అధికారులు

- బోర్డు సమావేశంలో దుమారం
- ఎంపీ, ఎమ్మెల్యే వాకౌట్
- అర్ధంతరంగా సమావేశం వాయిదా



బోర్డు సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో దుమారం రేగింది. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సాగిన మాటల యుద్ధం ఏకంగా సమావేశం రద్దుకు దారితీసింది. బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ నేతృత్వంలో ప్రారంభమైన సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్న అర్వింద్ కుమార్ ద్వివేది, జాయింట్ ఆశిక్, బోర్డు సభ్యురాలు భానుక నర్మదలతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు.

ఆరంభం నుంచే ఎంపీ ఆగ్రహం..

◆ ఎజెండాపై చర్చ ఆరంభానికి ముందు నూతన సీఈఓకు స్వాగతం పలికారు. కంటోన్మెంట్ బోర్డుకు ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించిన రూ.303 కోట్ల పరిహారం సొమ్ము వచ్చిందని అధ్యక్షుడు బోర్డుకు వెల్లడించారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అధికారులు స్థానిక ఎంపీగా తనకు తగిన గౌరవం ఇవ్వలేదంటూ మాట్లాడారు. ముఖ్యంగా డీఈఓ దినేశ్ కుమార్‌రెడ్డి తన ఫోన్‌కు స్పందించడం లేదన్నారు.

◆ రక్షణ స్థలాల్లోని అక్రమ నిర్మాణాల తొలగింపు విషయంలో అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారంటూ పేర్కొన్నారు. వందలాది ఎకరాల బీ–3 స్థలాలను కబ్జా చేసిన ఇంపీరియల్, బాంటియా, మల్లారెడ్డి, కేజేఆర్ తదితర గార్డెన్‌ల వదిలి, ఫుట్‌పాత్‌లపై వెలిసిన చిన్నపాటి దుకాణాలను తొలగించడమేంటని ప్రశ్నించారు.

◆ జేబీఎస్ ఆవరణలో కొన్నేళ్లుగా వీధి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని రోడ్డుపాలు చేయడమేంటన్నారు. దీంతో అధికారులు స్పందిస్తూ త్వరలోనే బీ–3 బంగళాల్లోని అక్రమ నిర్మాణాలకు కూల్చేస్తామన్నారు, ఇంపీరియల్, బాంటియా గార్డెన్‌లకు వెకేషన్ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

◆ పికెట్ ఎరుకల బస్తీలో ఇటీవల ఓ భారీ భవనం కూల్చివేతపై అధికారుల తీరును ఎంపీ తప్పుబట్టారు. సదరు నిర్మాణం అక్రమం అని గుర్తిస్తే, ఆరంభంలోనే నిలిపివేయాలి కదా అంటూ ప్రశ్నించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్నాక కూల్చివేయడం సరికాదన్నారు. ఈ అంశాన్ని తాను ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు.

◆ డీఈఓ పరిధిలోని స్థలాల్లో ఫైర్ క్రాకర్స్ దుకాణాల ఏర్పాటుకు అనుమతులు నిరాకరించడమేంటని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా దుకాణాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో యధావిధిగా ఫైర్ క్రాకర్స్ అమ్మకాలకు అవకాశం ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యే రాకతో వేడెక్కిన సమావేశం

◆ బోర్డు సమావేశం ఆరంభమైన అరగంట తర్వాత ఎమ్మెల్యే శ్రీగణేశ్ వచ్చారు. అప్పటికే సర్క్యులర్ ఎజెండాలపై చర్చ సాగుతుండగా, ఎమ్మెల్యే సీరియల్ నెంబర 16లోని సర్క్యులర్ ఎజెండాకు సంబంధించి పూర్తిసమాచారం వెల్లడించాలన్నారు

◆ భవన నిర్మాణాల అనుమతులు, టెండర్లకు సంబంధించి సర్క్యులర్ ఎజెండాల్లో ఏం పొందుపరిచారో తమకు తెలియకుండానే చర్చలో ఎలా పాల్గొంటామని ప్రశ్నించారు.

◆ ఓబీ పాస్ విధానం అమల్లోకి వచ్చాక భవన నిర్మాణ అనుమతులను సర్క్యులర్ ఎజెండాల ద్వారా మంజూరు చేస్తున్నామని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. భవన నిర్మాణ అనుమతుల జారీలో అధ్యక్షుడు, సీఈఓ, బోర్డు సభ్యురాలికి మాత్రమే అధికారం ఉందన్నారు.

◆ ఎంపీ, ఎమ్మెల్యే బోర్డు సమావేశాల్లో ప్రత్యేక ఆహ్వానితులు మాత్రమేనని వారికి ఓటింగ్ హక్కు లేదన్నారు. దీనిపై ఎంపీ, ఎమ్మెల్యే తీవ్ర అభ్యంతరం తెలిపారు.

◆ తాము పాల్గొనే సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బోర్డు అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తూ అనుమతులు జారీ చేయడంపై బాధితులు తమను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు.

◆ గతంలో మార్టిగేజ్ విధానంపై బోర్డు సమావేశం తీర్మానంలో తాను సంపూర్ణ మద్దతు తెలిపినట్లు ఏ విధంగా పేర్కొంటారని శ్రీగణేశ్ ప్రశ్నించారు. కేవలం ప్రత్యేక ఆహ్వానితుడిగా పేర్కొంటూనే, మార్టిగేజ్ విధానంపై తాను మద్దతు ఇచ్చినట్లు పేర్కొనడంలో అధికారులు ద్వంద్వ నీతికి పాల్పడుతున్నారని అన్నారు.

◆ ఏదేమైనా గతంలో మాదిరిగా బోర్డు సమావేశాల్లో తాను కేవలం ప్రేక్షక పాత్రకు పరిమితం కానన్నారు. సంపూర్ణ సమాచారం ఇచ్చి, చర్చలో పాల్గొనే అవకాశం ఇవ్వాల్సిందేనన్నారు. తీర్మానాలపై అధికారం బోర్డుదే అయినప్పటికీ, ఆయా అంశాల్లో చర్చలో ప్రజాప్రతినిధులమైన ఎంపీ, ఎమ్మెల్యే సలహాలు, సూచనలు తీసుకోవాల్సిందేనన్నారు. లేని పక్షంలో తాము సమావేశాలకు హాజరు కావడం వల్ల ప్రయోజనమేంటని నిలదీశారు.

◆ ఈ క్రమంలో సీఈఓ మధుకర్ నాయక్ జోక్యం చేసుకుంటూ మున్సిపల్ సంబంధిత వ్యవహారాల్లో నిర్ణయాధికారం బోర్డుదేనని మరోసారి స్పష్టం చేశారు. ఇందుకు అధ్యక్షుడు బ్రిగేడియర్ సైతం మద్దతు పలికారు.

◆ దీంతో ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు. దీంతో అధికారులు బోర్డు సమావేశాన్ని అర్ధంతరంగా ముగించేశారు.

ఆస్తులు కోల్పోయేవారికి అండగా ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎమ్మెల్యేకు తమ సమస్యను మొరపెట్టుకుంటున్న బేగంపేట పాటిగడ్డ నివాసితులు

సనత్‌నగర్: రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డ మీదుగా నెక్లెస్‌రోడ్డులోని సంజీవయ్య పార్కు వరకు జరిగే ఫ్లైఓవర్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోయే బేగంపేట పాటిగడ్డ నివాసితులకు న్యాయం జరిగేలా అండగా ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీనిచ్చారు. రైల్వేలైన్‌పై నెక్లెస్‌రోడ్డు, పాటిగడ్డ ప్రాంతాన్ని కలుపుతూ 600 మీటర్ల పొడవుతో రూ.80 కోట్ల వ్యయంతో రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)ని నిర్మించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో నెక్లెస్ రోడ్డు నుంచి పాటిగడ్డలోని మలీ పర్పస్ ఫంక్షన్ హాల్ వరకు భూసేకరణ ప్రక్రియను మొదలుపెట్టారు. అందులో భాగంగా ఆస్తులు కోల్పోయే వారికి బుధవారం నోటీసులు జారీ చేసిన దృష్ట్యా ఆందోళనకు గురైన పాటిగడ్డ నివాసితులు గురువారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. తమ ఆస్తులు పోతే పరిస్థితి ఏమిటని, ఇక్కడ ఆస్తిని కోల్పోతే ఎక్కడో ఇస్తారని, తాము ఇక్కడే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పాటిగడ్డలోనే ఉన్న ఆర్ అండ్ బీ క్వార్టర్స్ స్థలంలోనే తమ ఆస్తులకు ప్రతిగా స్థలం కేటాయిస్తే బాగుంటుందని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత శేఖర్‌ముదిరాజ్ తదితరులున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరం

ప్రభుత్వ మాజీ కార్యదర్శి రాజా సదరం

సనత్‌నగర్: ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరమని తెలంగాణ ప్రభుత్వ మాజీ కార్యదర్శి రాజా సదరం అన్నారు. ఆహారం అనేది నిత్య జీవితంలో ఒక భాగమని, ఆహారంపై పిల్లలకు అవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. బేగంపేటలోని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ చెఫ్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజా సదరం, కలినరీ ఆఫ్ ఇండియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అక్షయ కులకర్ణి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించడంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రతి ఏడాది ఇంటర్నేషనల్ చెఫ్ డే వేడుకలను ఒక్కొక్క థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు అక్షయ కులకర్ణి తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే మిల్లెట్స్ ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు.

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని ఏఐసీసీ పరిశీలకుడు మాజీ కేంద్ర మంత్రి సీపీ జోషి అన్నారు. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి ఎంపిక కోసం గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని ఏ, బీ బ్లాక్‌లకు చెందిన కార్యకర్తల సమావేశం బాలంరాయిలోని లీ ప్యాలెస్, జయలక్ష్మి గార్డెన్‌ల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీపీ జోషి, నారాయణ్‌పేట్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్‌లు హాజరయ్యారు.

నేను అల్లాటప్పా ఎమ్మెల్యేను కాదు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్



కంటోన్మెంట్: తాను 'అల్లా టప్పా ఎమ్మెల్యేను కాదు అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కంటోన్మెంట్ బోర్డు సమావేశం నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని ఏకైన మున్సిపల్ బాడీ అయిన కంటోన్మెంట్‌లో చేపట్టే కార్యక్రమాలపై ఎమ్మెల్యే ప్రభావం ఉండాల్సిందేనన్నారు. ప్రజాధనం వినియోగం విషయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించకూడదన్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేలను ఏమార్చినట్లు అధికారులు తనను మోసం చేసే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. జేబీఎస్ సమీపంలోని పార్కింగ్ టెండర్ల విషయంలో తాను అభ్యంతరం చెప్పాకే బోర్డుకు రూ.70 లక్షల అధిక ఆదాయం సమకూరిందన్నారు. జైకా పనుల టెండర్లను సైతం 1.79 కోట్ల నుంచి రూ.5.85 కోట్లకు పెంచాలనుకోవడంపై అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. నిర్ణయాధికారం అధికారులదే అయినప్పటికీ ప్రజలకు, ప్రజాప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యేకు జవాబుదారీగా ఉండాల్సిందేనన్నారు. బోర్డు నిర్ణయాల్లో తప్పు జరిగితే తాను ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. బోర్డు సమావేశంలోని చర్చల్లో తమ వ్యాఖ్యలను సైతం వక్రీకరిస్తున్నట్లు తెలిపారు.

ఇది రిజర్వేషన్ల ఉద్యమం కాదు..

బీసీల ఆత్మగౌరవ పోరాటం



బీసీ జేఏసీ నూతన కార్యవర్గం

లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఆర్‌పీఐ(భీమ్‌రావ్, అంబేడ్కర్) పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందనీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.గాలి వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం తార్నాకలోని పార్టీ కార్యాలయంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని వినోద్‌కుమార్‌ను కలిసి బంద్‌కు ఆర్‌పీఐ మద్దతు కోరారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఎక్కడా 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండరాదని నిబంధన ఏమి లేదన్నారు. విద్యా, ఉద్యోగ రంగాలకు సంబంధించి 50 శాతం తీర్పును లోకల్ బాడీ ఎన్నికలకు ముడిపెట్టి తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడం, సుప్రీం కోర్టు దాన్ని సమర్థించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నారగోని మాట్లాడుతూ 18 నాటి రాష్ట్ర బంద్ ప్రారంభం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ తెలంగాణ, ఏపీ ఇన్‌చార్జి డా. మేజర్ చంద్రకాంత్, వర్కింగ్ ప్రసిడెంట్ సయ్యద్ ఏజాజ్ ఉస్సేనీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బాబు తదితరులున్నారు.

జస్టిస్ ఫర్ బంద్‌కు బీసీ స్టూడెంట్ జేఏసీ మద్దతు

లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జరిగే జస్టిస్ ఫర్ బంద్‌కు బీసీ స్టూడెంట్ జేఏసీ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు బీసీ విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. బీసీ స్టూడెంట్ జేఏసీని ఏర్పాటు చేశారు. బీసీ స్టూడెంట్ జేఏసీ గౌరవ సలహాదారులుగా ప్రొ. రాము షపర్డ్, ప్రొ.కొండా నాగేశ్వర్‌రావు, టీఎస్‌పీఏసీ జేఏసీ అధ్యక్షుడు వలిగొండ నరసింహా, గౌరవ అధ్యక్షుడు జంపాల రాజేష్, బీసీ స్టూడెంట్ జేఏసీ స్టూడెంట్ జేఏసీ చైర్మన్ సైదులు యాదవ్, వైస్ చైర్మన్ సురేష్, రవి, వెంకట్ సాయి, అధ్యక్షుడు వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, శేఖర్, రవికుమార్, ప్రధాన కార్యదర్శులు భారీ అశోక్, గణేశ్‌గౌడ్, అభిలాష్ వర్మ, కార్యదర్శులు శ్రీధర్, శ్రీనివాస్, శివ, శ్రీశైలం, ప్రణయ్, శివకుమార్, అధికార ప్రతినిధులుగా మధు, ప్రశాంత్, రమేశ్ తదితరులను కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ తెలంగాణ సబ్బండ వర్గాలు బంద్‌లో పాల్గొని బీసీల అస్థిత్వాన్ని చాటాలన్నారు.

బీసీ బంద్‌కు గంగపుత్ర సంఘం మద్దతు



బీసీ రాష్ట్ర బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్న ఆర్‌పీఐ నేతలు

సికింద్రాబాద్: బీసీల రిజర్వేషన్లకు మద్దతుగా ఈనెల 18న నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు గంగపుత్ర సంఘం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా గురువారం సికింద్రాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేశబోయిన రఘు నేతృత్వంలో కార్యవర్గ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. అనంతరం దేశబోయిన రఘు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణబంద్‌కు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకులు కైరంకొండ యాదగిరి, అక్కపల్లి ఉదయ్‌కిరణ్, దామెన సదానంద్, వంగల సుధాకర్, అంబటి రమేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో కల్పించేలా పార్లమెంట్‌లో తక్షణమే బిల్లు పెట్టాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. 75 ఏళ్ల నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు రిజర్వేషన్లు న్యాయబద్ధంగా కల్పించకుండా మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు రవి, నాగరాజు, శ్రీకాంత్, నాగేంద్ర,నిఖిల్, శరత్‌గౌడ్, ప్రసాద్, భాను, వెంకట్, ప్రణయ్ తదితరులున్నారు.

యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలి

విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు

లాలాపేట: విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులందరికీ వెంటనే యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం స్టేట్ కోఆర్డీనేషన్ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద అధ్యాపకులు మాట్లాడుతూ.. తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకులు బోధనతో పాటు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలను సైతం నిర్వహిస్తున్నామన్నారు. ఐదు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకులందరికీ యూజీసీ వేతనాలను వర్తింపజేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు అధికారులు అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ వేతనాలు వర్తింపజేయకుండా అధ్యాపకుల నియామక ప్రక్రియ ప్రారంభిస్తే సహించేది లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించిన తర్వాతే నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. లేనిచో కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామన్నారు. మరోవైపు యూనివర్సిటీలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. దీనిపై సీఎం సానుకూలంగా ఉన్నప్పటికీ అధికారులు తప్పుడు సంకేతాలు పంపించి కావాలనే సమస్య పరిష్కారం కాకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. డా.ఉపేందర్, డా.సనత్, వెంకటేశ్వర్లు, రేష్మారెడ్డి, డా.రాజేంద్రప్రసాద్, అరుణ్, చిరంజీవి, రమేశ్, రామలింగం, తిరుపతి, లింగం, నవీన్ తదితరులున్నారు.

వైద్యరంగంలో అనస్తీషియా అత్యంత కీలకం



స్టేట్ ఫస్ట్‌ర్యాంక్ సాధించిన డా.కావ్యను సత్కరిస్తున్న గాంధీ పాలన యంత్రాంగం

గాంధీఆస్పత్రి: వైద్యరంగంలో అనస్తీషియా అత్యంత కీలకమని వైద్యరంగ నిపుణులు అన్నారు. ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ అనస్తీషియా విభాగ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, రిటైర్డ్ ప్రొఫెసర్ మేజర్ ఎంవీ భీమేశ్వర్, అనస్తీషియా హెచ్‌ఓడీ మురళీధర్‌లు హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి సదస్సును ప్రారంభించారు. వైద్యచికిత్సలు, ట్రామాకేర్, సర్జరీలు, దీర్ఘకాలిక నొప్పులు తదితర అంశాల్లో అనస్తీషియా వైద్యులే కీలకమని, గాంధీ ఓపీ విభాగంలో దీర్ఘకాల మొండి నొప్పుల నివారణకు పెయిన్‌క్లినిక్ అందుబాటులోకి తెచ్చామన్నారు. 1846 అక్టోబర్ 16న డాక్టర్ మోర్టాన్ మొట్టమెదటిసారిగా డెంటల్ సర్జరీలో అనస్తీషియా వినియోగించారని, ఈ ఏడాది అనస్తీషియాలజీ ఇన్ హెల్త్ ఎమర్జెన్సీస్ నినాదంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. స్టేట్ ఫస్ట్‌ర్యాంక్ సాధించిన గాంధీ వైద్యవిద్యార్థిని డాక్టర్ కావ్యకు గోల్డ్‌మెడల్, ప్రసంసాపత్రం బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో గాంధీ అనస్తీషియా విభాగ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ మురళీధర్, కిరణ్‌మాదల, టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షకార్యదర్శులు భూపేంద్ర సింగ్ రాథోడ్, అబ్బయ్య, కోశాధికారి రవికుమార్, హెచ్‌ఓడీలు సుబోధ్‌కుమార్, శ్రీనివాస్, సునీల్‌కుమార్‌లతో పాటు వైద్యులు, వైద్యవిద్యార్థులు, ఆర్‌ఎంఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



బోర్డు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రాజీవ్ రహదారి విస్తరణ బాధితులు

కంటోన్మెంట్: రాజీవ్ రహదారి విస్తరణను కుదించాలంటూ బాధితులు బోర్డు కార్యాలయాన్ని ముట్టడించారు. రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తా ఆధ్వర్యంలో బాధితులు గురువారం బోర్డు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బోర్డు సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్‌లకు వినతి పత్రాలు అందజేశారు. తమ డిమాండ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరు. రోడ్డు విస్తరణను 200 అడుగులకు బదులుగా 100 అడుగులకు కుదించాలన్నారు. బహిరంగా మార్కెట్‌లో ఉన్న రేట్‌లకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలన్నారు. రోడ్డు విస్తరణ బాధితులకు ఆస్తిపన్ను రద్దు చేయాలన్నారు. ఆస్తులను కోల్పోతున్న వారిలో కుటుంబానికి ఒకరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



నా కల నెరవేరింది

గ్లోబల్ టూరిజం అంతర్జాతీయ సదస్సులో మంత్రి వాకిటి శ్రీహరి

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం జరిగిన గ్లోబల్ టూరిజం అంతర్జాతీయ సదస్సుకు హాజరైన రాష్ట్ర పశుసంవర్ధక, యూత్ అఫైర్స్ శాఖా మంత్రి వాకిటి శ్రీహరి ఓయూ విద్యార్థులనుద్దేశించి గట్టిగా మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల తన కల ఈ రోజు నెరవేరిందని పేర్కొన్నారు. అద్దంకి దయాకర్ లాగా తాను యూనివర్సిటీ స్టూడెంట్‌ను కానని, మంత్రి జూపల్లి కృష్ణారావులాగా ఉస్మానియాలో చదవాలనీ అనుకోలేదన్నారు. కానీ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి వెళ్తున్నప్పుడు 'ఏదో ఒక రోజు వస్తుంది.. ఆ రోజు నేను ఉస్మానియా క్యాంపస్‌లో గట్టిగా మాట్లాడాలి' అనుకునే వాడినని, ఆ కల ఈరోజు నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. దీన్ని తాను ఎంతో అదృష్టంగా భావిస్తున్నాని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ సదస్సు ద్వారా ఠాగూర్ ఆడిటోరియంలో ఓయూ విద్యార్థుల ముందు మాట్లాడే అవకాశం కల్పించిన సెమినార్ డైరెక్టర్ ప్రొ.డి.చెన్నప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌శాఖ అధికారుల బస్తీబాట

సనత్‌నగర్: బస్తీబాటలో భాగంగా టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు బేగంపేటలో పర్యటించారు. టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ భీమ్‌నాయక్, ఏఈ సాయికుమార్‌లతో పాటు సిబ్బంది శ్యాంలాల్ బిల్డింగ్స్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అధికారులతో పాటు కాంగ్రెస్ నేతలు హోసిటోచర్, ప్రవీణ్, రాజు, పేపర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

సనత్‌నగర్: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్‌లోని బీకేగూడలో శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ ప్రైమ్ హాస్పటల్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పార్థసారధి, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి,నిర్వాహకులు పార్థసారధి, ఆస్టర్‌ప్రైమ్ హాస్పటల్ వైద్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE Ist JR. CIVIL JUDGE, CITY CIVIL COURT AT: SECUNDERABAD
OS No. 722 of 2021

Between
State Bank of India RACPC - I, Secunderabad ...Plaintiff
And
Mr. Vepula Mallesh & another ...Defendant
To
1) Mr. Vepula Mallesh S/o. Komaraiah, H.No. 4-7-10/A, Plot No. 38, Raghavendra Nagar, Hyderabad-500076.
2) K. Srinivasulu, S/o. K. Shankaraiah Flat No. 303, Road No. [illegible] New Royal Nest Apartments, West Marredpally, Secunderabad

NOTICE

The above named plaintiff filed suit for Money Recovery against both of you for Rs 1,44,454/- (One Lakhs Forty Four Thousand Four Hundred and Fifty Four only) before the Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, Secunderabad. The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to 17-10-2025 for your appearance. You both have to appear before Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, Secunderabad at 10:30 AM or if both of you fail to appear before Hon'ble Court, the matter will be heard and you both are set ex-parte.

By order of the
Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, Secunderabad
Sd/- M.P. SANJAY, Advocate for the Plaintiff
H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad - 500 009. Ph: 040-[illegible], Cell: [illegible]